క్లుప్తంగా

నేడు విద్యుత్తు సరాఫరాకు అంతరాయం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం–తాడిపర్రు 11 కేవీ విద్యుత్తు ఫీడర్ వార్షిక మరమ్మతుల్లో భాగంగా మండలంలో తాడిపర్రు గ్రామానికి, ఉండ్రాజవరం పంచాయతీ పరిధిలోని రైతులకు శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ విద్యుత్తు సరాఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో నిడదవోలు ఈఈ బి.వీరభద్రరావు శుక్రవారం తెలిపారు. వ్యవసాయ విద్యుత్తు సరాఫరా వేళలను ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు, మరలా మధ్యాహ్నం 1 గంటకు ఇచ్చేలా మార్పు చేసినట్టు తెలిపారు.

బాధిత కుటుంబానికి దాతల సాయం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న గ్లోబల్ ఇన్నార్క్ మాక్ సంఘ సభ్యులు

తాళ్లపూడి: పైడిమెట్ట గ్రామంలో ఇటీవల సంభవించిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన దేవరపల్లి కిషోర్ కుటుంబానికి దాతలు శుక్రవారం అండగా నిలిచారు. గ్లోబల్ ఇన్నార్క్ మాక్ సంఘ సభ్యులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. అలాగే జిల్లా అరుంధతీయ ఉద్యోగ, ఉపాధ్యాయ సమాఖ్య రూ.15 వేల ఆర్థిక సాయం చేసింది. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు డాక్టర్ పీవీ రామ్, కొల్లి చినబాబు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలకలు, స్టేషనరీ అందజేత



బల్లిపాడు జేబీ స్కూల్ విద్యార్థులకు పలకలు, స్టేషనరీ అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి: దాతల సహకారంతో శుక్రవారం బల్లిపాడు మండల పరిషత్ జూనియర్ బేసిక్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర స్టేషనరీ అందజేశారు. సుమారు 60 మంది విద్యార్థులకు దాతలు వల్లభని శ్రీనివాసు, వల్లిపల్లి సతీష్ చేతుల మీదుగా స్టేషనరీ అందజేశారు. గ్రామానికి చెందిన ఓం శ్రీ సాయి రామజ్ఞాన మండలి సమకూర్చిన రూ. 5 వేల ఆర్థిక సాయంతో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గెద్దం విజయకుమార్ రాజు, ఉపాధ్యాయురాలు జి.వరలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చర్మకారుల ఉపాధి పెంపునకు కృషి

కొవ్వూరు: భవిష్యత్తులో లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పునరుద్ధరణతో పాటు చర్మకారుల వృత్తి నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా మాదిగలకు ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్తానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి కేఎస్ జవహర్ అన్నారు. చర్మకార సంఘం నాయకులతో కలిసి శుక్రవారం ఆయన పట్టణంలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఏపీ రాజముద్ర (చిహ్నం) కలశం తయారు చేసిన ఘనత మాదిగలదే అన్నారు. భవిష్యత్తులో మాదిగల అభ్యున్నతికి అన్ని రకాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాదిగలకు వృత్తిపరమైన ఉపాధి అవకాశాలు మెరుగు పరిచే విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా చర్మకార సంఘం నాయకులు జవహర్‌ను ఘనంగా సత్కరించారు. పార్టీ చర్మకార సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పులిమేల నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు కొండూరు కిషోర్‌కుమార్, కొండముది కృష్ణ, పునురి శివ, కొందుల ప్రసాద్, తల్లూరి జయరావు, కొత్తపల్లి భిక్షాలు, చిరుగూరి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ వరకూ డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

కొవ్వూరు: రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైనట్టు స్థానిక ఏబీఎన్ అండ్ పీఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎన్‌వీ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఇంటర్ మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో పాసైన విద్యార్థులు బీఎస్సీ, బీకాంలలో చేరేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జూలై పదో తేదీ వరకు రిజిస్ట్రేషన్‌లు, 11 నుంచి 15 వరకూ ఐచ్ఛిక మేజర్ సబ్జెక్టుల ఎంపిక ప్రక్రియ ఆన్‌లైన్‌లో నిర్వహించనున్నట్లు వివరించారు. కావున విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఓపెన్ కేటగిరిలో ఈడబ్ల్యూఎస్ పత్రం తీసుకుని కళాశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

వ్యాధుల సీజన్‌లో తాపీగా పనులు

- మురికివాడల్లోని డ్రైన్లలో తొలగించిన మురుగు
- పెరుగుతున్న దోమల బెడద
- పనిచేయని ఫాగింగ్ యంత్రాలు
- పారిశుధ్య వాహనాలదీ అదే తీరు



పట్టణంలోని మేజర్ డ్రైన్‌లో పూడిక తీస్తున్న పారిశుధ్య కార్మికులు



దోమల నివారణకు డ్రైన్‌లో పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికుడు



రాయిపేటలోని మురుగు కాలువ దుస్థితి

నిడదవోలు: వర్షాకాలం ప్రారంభమై, మలేరియా కేసులు నమోదవుతున్న ప్రస్తుత తరుణంలో పారిశుధ్య నిర్వహణపై పురపాలక సంఘం ప్రత్యేక దృష్టి సారించింది. అయితే తగినంత సాధన సంపత్తి లేకపోవడంతో పారిశుధ్య పనులు మందకొడిగా సాగుతున్నాయి. నిడదవోలు పట్టణంలోని మురికివాడల్లోని డ్రైనేజీల్లో సైతం సక్రమంగా పూడిక తీయడం లేదు. ఫలితంగా డ్రైన్లలో మురుగు పెరిగిపోయి అధ్వాన స్థితికి చేరుతున్నాయి. పలు ప్రాంతాల్లోని మురుగు కాలువలు దోమల నివాస కేంద్రాలుగా మారాయి. దీంతో తాము రోగాలు బారిన పడే ప్రమాదం లేకపోలేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలో పూర్తిస్థాయి పారిశుధ్య పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.

22 మెట్రిక్ టన్నుల చెత్త తరలింపు

పట్టణంలోని 28 వార్డుల్లో రోజువారీ ఉత్పత్తి అయ్యే 22 మెట్రిక్ టన్నుల చెత్త, ఇతర వ్యర్థాలను పారిశుధ్య కార్మికులు కంపోస్టు యార్డుకు తరలిస్తున్నారు. ఇందుకోసం మూడు ట్రాక్టర్లు ఉండగా, వాటిలో ఒకటి పనిచేయడం లేదు. రెండు కంపాక్టర్లు, జేసీబీతో పనులు చేస్తున్నారు. గతంలో కొనుగోలు చేసిన ఆరు ఈ–ఆటోలు మరమ్మతులకు గురవడంతో వాటిని మూలన పెట్టారు. నిడదవోలు మున్సిపాలిటీలో 118 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. కార్మికులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నప్పటికీ పారిశుధ్య వాహనాలు మూలన పడడంతో పారిశుధ్య పనులు అంతంత మాత్రంగా జరుగుతున్నాయి. వాహనాలను మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉంది. ఈ–ఆటోలు పనిచేయకపోవడంతో తడి, పొడి చెత్త సేకరణ మందకొడిగా సాగుతోంది.

పూడికతీతకు రూ.5 లక్షలు

పట్టణ పరిధిలో 12.9 కిలోమీటర్ల పొడవైన మీడియం, మేజర్ డ్రైన్లు ఉన్నాయి. వాటి నిర్వహణపై మున్సిపల్ అధికారులు దృష్టి పెట్టారు. రోజువారీ పనుల్లో భాగంగా చిన్న మురికి కాలువల్లో పూడిక తీయిస్తున్నారు. ఇందుకోసం మున్సిపల్ సాధారణ నిధులు రూ.5 లక్షలు కేటాయించారు. అయితే పూడికతీత పనులు ఆశించినంతగా ముందుకు సాగడం లేదు. నిబంధనల ప్రకారం వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే డ్రైన్లలోని పూడిక తీయించాలి. వర్షాలు మొదలయ్యాక ఈ పనులు చేపట్టడం వల్ల తీసిన పూడిక తిరిగి డ్రైన్లలోకి చేరే అవకాశం ఉంది. దీంతో నిధుల వృథా అవుతాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. గతంలో కూడా డ్రైన్లలోని పూడికను పూర్తిస్థాయిలో తొలగించక పోవడంపై పలువురు సభ్యులు కౌన్సిల్లో చైర్మన్ భూపతి ఆదినారాయణ దృష్టికి తీసుకు వచ్చారు. ప్రస్తుతానికి సంజీవయ్య నగర్, భీమదొర తూము, రైల్వేలైన్ ప్రాంతాల్లో పూడికతీత పనులు పూర్తి చేశారు. ఇంకా పలు మేజర్ డ్రైన్‌లలో పనులు చేపట్టాల్సి ఉంది. మాలకోడు, ఎఫ్‌సీఐ గోడౌన్, గాంధీనగర్, ఎంవీ నగర్, 27 వార్డులోని మేజర్ అవుట్‌లెట్‌లలోని పూడికతీత పనులు జేసీబీ సాయంతో పూర్తి చేశారు.

మంచినీటి నిర్వహణకు రూ.60 లక్షలు

పట్టణ ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ ఏడాది బడ్జెట్‌లో మున్సిపల్ సాధారణ నిధులు రూ.60 లక్షలు కేటాయించారు. పట్టణంలోని ఏడు మంచినీటి రిజర్వాయర్లు ఉన్నాయి. వాటి ద్వారా రోజూ 22.50 లీటర్ల తాగునీటిని పట్టణ ప్రజలకు అందించాలి. వాటికి అనుబంధంగా ఏడు బోర్లు ఉన్నాయి. తాగునీటి సరఫరా నిర్వహణకు అవసరమైన పైపులు, బోర్లు, వాల్వ్‌ల మరమ్మతులు, లిక్విడ్, గ్యాస్ క్లోరినేషన్ వంటి వాటి కోసం ఈ నిధులను ఖర్చు చేయనున్నారు.

జాడ లేని ఫాగింగ్

పట్టణంలో పట్టపగలే దోమలు విజృంభిస్తున్నాయి. ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అయినప్పటికీ అధికారులు దోమల నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలున్నాయి. ప్రధానంగా దోమల నివారణకు ఉపయోగించే ఫాగింగ్ యంత్రాల జాడ కానరావడం లేదు. పట్టణ శివారు ప్రాంతాల్లో మురుగు పారుదల వ్యవస్థ అధ్వానంగా ఉండడంతో పగలే దోమలు కుట్టేస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. వీధుల్లో పేరుకుపోయిన చెత్త కుప్పలను పారిశుధ్య సిబ్బంది సకాలంలో తొలగించక పోవడంతో దుర్వాసన వ్యాపిస్తోంది. ప్రధానంగా ఎస్టీ కాలనీ, వైఎస్సార్ కాలనీ ఇందిరా నగర్, సుబ్బరాజుపేట, ఎంవీ నగర్ ప్రాంతాల మురుగు కాలువల్లో వృద్ధి చెందిన దోమలు, ఇతర కీటకాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆయా ప్రాంతాల వారు చెబుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న మురుగు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. దోమలు నివారణకు ఫాగింగ్ చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వారం రోజుల్లో ఫాగింగ్ చేయిస్తాం



దోమల నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. డ్రైన్‌లలో పిచికారీ చేయిస్తున్నాం. పారిశుధ్య సిబ్బంది రోజువారీ శానిటేషన్ పనులు చేపడుతున్నాం. మురికివాడల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మున్సిపల్, ఆరోగ్య శాఖల ఉద్యోగులు అవగాహన కల్పిస్తున్నారు. మూడు ఫాగింగ్ యంత్రాలు పాడైపోయాయి. వారం రోజుల్లో మరమ్మతులు చేయించి పట్టణంలో ఫాగింగ్ చేయిస్తాం.

– టి. రాంభూపల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, నిడదవోలు

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించండి



దేవరపల్లి ఇందిరమ్మ కాలనీలోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలిస్తున్న డీఎల్‌డీవో శాంతామణి



పాలంగిలో డెంగీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు



చాగల్లు సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ బుజ్జి తదితరులు

- డీఎల్‌డీఓ శాంతామణి
- దేవరపల్లి, గోపాలపురం మండలాల్లో పర్యటన

దేవరపల్లి: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పంచాయతీల అధికారుల డివిజనల్ అభివృద్ధి అధికారి (డీఎల్‌డీఓ) వి. శాంతామణి ఆదేశించారు. దేవరపల్లిలోని ఇందిరమ్మ కాలనీ, యాదవోలు రోడ్డులోని మంచినీటి ఓవర్ హెడ్ ట్యాంకులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌డీఓ శాంతామణి మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, ఎప్పటి చెత్తను అప్పుడు యార్డుకు తరలించాలని ఆదేశించారు. త్వరలో జిల్లా కలెక్టర్ పర్యటన ఉంటుందన్నారు. ప్రతి 15 రోజుల కొకసారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలని సూచించారు. పంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలని, పైప్‌లైన్ల లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల ముందు నీటి నిల్వగుంటలు లేకుండాను, దోమల నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి. ప్రభాకరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బీఆర్ఎస్ కుమారి, పంచాయతీ కార్యదర్శులు ఎస్.రవికిషోర్, హరిబాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

గోపాలపురం: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు మంచినీటి ట్యాంకులను శుభ్రపరచాలని కొవ్వూరు డీఎల్‌డీఓ వి.శాంతమణి అన్నారు. గోపాలపురం, వేళ్లచింతలగూడెం గ్రామాల్లోని ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులను శుక్రవారం ఆమె పరిశీలించారు. వర్షాకాలం కావడంతో తాగునీటి విషయంలో జాగ్రత్తలు పాటించాలని కార్యదర్శులకు సూచించారు. గ్రామాల్లో ప్రజలు అనారోగ్యానికి గురైన వెంటనే మంచినీటి పరీక్షలు చేయించాలని ఎంపీడీఓ కె. రమేష్ బాబుకు సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ఎం. చినవెంకాయమ్మ, కె. సాంబమూర్తి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బంది ఉన్నారు.

దోమల వల్ల వ్యాధులు వచ్చే అవకాశం

ఉండ్రాజవరం: దోమల వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని తణుకు మలేరియా సబ్ యూనిట్ అధికారి జి. వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలో పాలంగి, కె.సావరం గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే, డెంగీ వ్యతిరేక మాసోత్సవం, మస్కిటో లార్వా డెన్సిటీ యాక్టివిటీస్‌పై శుక్రవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఆయన మాట్లాడుతూ జ్వరం ఉంటే విధిగా ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి, వైద్యం పొందాలన్నారు. ప్రజలకు డెంగీ వ్యాధిపై అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు ఎన్. భానుశ్రీ , కె.బేబీకుమారి, హెల్త్ అసిస్టెంట్లు ఎం.శ్రీనివాసు, కె.నాగరాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వచ్ఛ సంకల్పంపై చాగల్లులో సమీక్ష

చాగల్లు: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.బుజ్జి సూచించారు. స్వచ్ఛ సంకల్పం రోజువారీ దిన చర్యపై మండల స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీవో ఎస్.బుజ్జి, మండల విస్తరణాధికారి ఆర్.శ్రావణ్‌కుమార్, మెడికల్ ఆఫీసర్లు టి.మనోజ్, అశోక్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో బుజ్జి మాట్లాడుతూ డయేరియా, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు రాకుండా పంచాయతీలలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అందుకనుగుణంగా శానిటేషన్, క్లోరినేషన్, బ్లీచింగ్, పైప్‌లైన్లు, బోర్ల నిర్వహణ, ఫాగింగ్ వంటి పనులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను ఎప్పటకప్పుడు శుభ్రపరచాలన్నారు.సమావేశంలో చాగల్లు సర్పంచ్ యు.మనశ్శాంతి, ఎం.వెంకటరావు, కె.రాంబాబు, జి.కుమారి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డైట్ విద్యార్థులకు వైద్య పరీక్షలు



డైట్‌లో విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు

నల్లజర్ల: దూబచర్లలోని జిల్లా ఉపాధ్యాయశిక్షణ సంస్థ (డైట్) కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం నల్లజర్ల పీహెచ్‌సీ డాక్టర్ గంగాధరరావు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో అతిసారం ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హోటళ్లలోని తిను బండారాలు తినవద్దని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడిగా ఉండగానే ఆహార పదార్థాలను భుజించాలన్నారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ నీళ్ల విరేచనాలు అయితే దానిని అతిసార వ్యాధిగా గుర్తించాలన్నారు. అతిసారం బ్యాక్టీరియా,వైరస్, ఇతర సూక్ష్మజీవుల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, సీహెచ్‌ఓ పలివెల ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై నిరసన




పట్టణంలో నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నిడదవోలు: హిందువులపై లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా హిందూ ధర్మ ఐక్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం నిరసన తెలిపారు. రాహుల్ గాంధీబొమ్మకు చెప్పులు కట్టి స్థానిక గణేష్ చౌక్ సెంటర్‌లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగా వెంకటేశ్వరరావు, బండి సత్యనారాయణ, నీలం రామారావు, బండి సూర్యనారాయణ, గమిని వెంకటరత్నం, దొడ్డి రామారావు, మెట్టపల్లి సుబ్బారాయుడు, కట్టుంగ అచ్చియ్య, సురేష్, వలివేటి వెంకట సుబ్బారావు, గన్నాబత్తుల మూర్తి తదితరులు పాల్గొన్నారు.

7న జగన్నాథ స్వామి రథయాత్ర

సీటీఆర్ఐ: ఈనెల 7వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు స్థానిక శ్యామలానగర్ రామాలయం సెంటర్ నుంచి జగన్నాథ స్వామి రథయాత్ర ప్రారంభమవుతుందని ఇస్కాన్ రాజమండ్రి మందిర కమిటీ చైర్మన్ శివానంద నిమాయదాస్ చెప్పారు. ఇస్కాన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది పూరీలో జగన్నాథ స్వామి రథయాత్ర వైభవంగా జరుగుతుందన్నారు. ఇస్కాన్ మందిరంలోనూ జగన్నాథ స్వామి కొలువై ఉన్నారని ఇక్కడ కూడా ఏటా రథయాత్ర నిర్వహిస్తున్నామని గుర్తుచేశారు. సాధారణంగా రథయాత్ర అంటే ఉత్సవ మూర్తులను ఊరేగిస్తారని, జగన్నాథ స్వామి రథయాత్రలో మూలవిరాట్టును ఉంచుతారని ఆయన చెప్పా రు. మందిరానికి రానివాళ్ల కోసం స్వామి వారే స్వ యంగా బయటకు వచ్చి దర్శన భాగ్యం కల్పించడమే జగన్నాథ రథయాత్ర ప్రత్యేకతగా శివానంద నిమాయదాస్ చెప్పారు. ఇస్కాన్ ఆంధ్రప్రదేశ్ జోనల్ సెక్రటరీ రేవతి రమణ్ ప్రభుజీ ముఖ్య అతిథిగా పాల్గొని, రథయాత్ర ప్రారంభిస్తారని తెలిపారు. కీర్తనలు, భజనల నడుమ శ్రీ జగన్నాథ బలదేవ సుభద్రల విగ్రహాలను రథంలో ఉంచుతామని, ఇస్కాన్ స్వామీజీలు, ముఖ్య అతిథుల సందేశాలు ఉంటాయని తెలిపారు. గోరక్షణ పేట, ఆజాద్ చౌక్, జాంపేట, ఊర్వశి సెంటర్, బీఈడీ ట్రైనింగ్ కాలేజీ, డీలక్స్ సెంటర్, హెడ్ పోస్టాఫీసు, మహాకాళేశ్వర ఆలయం మీదుగా రథయాత్ర ఇస్కాన్ కి చేరడంతో ముగుస్తుందని శివానంద నిమాయదాస్ వివరించారు. రథయాత్రలో భక్తజనులు పాల్గొని జగ న్నాథ స్వామి అనుగ్రహం పొందాలని ఆయన కోరారు.

మేఘమే ఛత్రమై.. నగరాన్ని కప్పేసింది





రాజమహేంద్రవరంలో ఆకాశంలో కనువిందు చేసిన దృశ్యాలు

రాజమహేంద్రవరం సిటీ: ఉదయం అంతా ఉక్కపోత, మధ్యాహ్నం మండుటెండ కారణంగా విలవిల్లాడిన నగర ప్రజలు సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఈదురు గాలులు వీయడంతో సేద తీరారు. ఆకాశంలో మేఘాలు విభిన్న ఆకృతుల్లో దర్శనమిచ్చి నగర ప్రజల మనస్సులను దోచుకున్నాయి. వర్షం వస్తుందని ఆశగా ఎదురు చేసిన నగర ప్రజలకు మేఘాలు మాత్రం కనువిందు చేశారు. ఆకాశంలో దట్టమైన మేఘాలు కమ్ముకుని రాజమహేంద్రవరం నగరాన్ని దుప్పటిలా కప్పేశాయి. శుక్రవారం సాయంత్రం రోడ్ కమ్ రైల్వే బ్రిడ్జిపై నుంచి ప్రయాణిస్తున్న వారిని వివిధ రంగుల్లో మేఘాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

నిర్లక్ష్యపు తీగలు

ధవళేశ్వరం: ధవళేశ్వరం గోదావరి గట్టు రోడ్డుపై విద్యుత్ తీగలకు పాదులు, పొదలు చుట్టి ప్రమాదకరంగా మారాయి. మరో పక్క వర్షాకాలం రావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అని వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ధవళేశ్వరం సాయిబాబా గుడి నుంచి గాయత్రి ఇసుక ర్యాంపు వరకూ ఉన్న విద్యుత్ స్తంభాలకు పొదలు పాకి అల్లుకుపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పొదలు, పాదులు పెరిగిపోయినా పట్టించుకునే వారే కరవయ్యారు. ఈదురు గాలులు సమయంలో వీటి ప్రభావం వల్ల విద్యుత్ తీగలు తెగి పడే ప్రమాదం పొంచి ఉంది. విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. విద్యుత్తు శాఖ అధికారులు తక్షణమే స్పందించి విద్యుత్తు తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదకరంగా పాకిన పాదులను, పొదలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.



విద్యుత్ తీగలకు ప్రమాదకరంగా పాకిన పొదలు, పాదులు



ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదకరంగా పాకిన పొదలు